
కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకారంలో వాసవీమాత

రూ.కోటితో ధనలక్ష్మి అలంకరణ

రాయదుర్గం పట్టణంలోని నగరేశ్వర కన్యకపరమేశ్వరి దేవాలయంలో వాసవీమాతకు ఆదివారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రూ.కోటి నగదుతో ధనలక్ష్మి అలంకరణ చేశారు. అమ్మవారికి ఉదయాన్నే అభిషేకాలు చేశారు. అనంతరం రూ.కోటి విలువైన అమ్మవారికి అలంకరణ చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

-రాయదుర్గం (ఆంధ్రజ్యోతి)

బొప్పాయి రైతు కన్నీళ్లు..!



ఒక్క కోత కూడా కోయలేదు

నాలుగెకరాల్లో బొప్పాయి సాగు చేశా. రూ.4 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. పంట పెట్టిన నెల రోజులకే తెగులు సోకింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం దక్కలేదు. పెట్టుబడి పెరుగుతోందే తప్ప.. తెగులు అదుపులోకి రావట్లేదు. నష్టం భరించలేక పంటను తొలగించుకున్నా. ఒక్క కోత కూడా కోయలేదు. సర్వం నష్టపోయా.

-రామదాసు, రైతు, ఆత్మకూరు

లక్షలు పెట్టి.. పంట సాగు.. చుట్టుముట్టిన వైరస్

- ఎన్ని మందులు పిచికారి చేసినా అదుపులోకి రాని దుస్థితి
- తోటలను వదిలేస్తున్న రైతులు..
- సర్వం నష్టపోతున్న వైనం

వర్షాధార పంటలతో ఏటా నష్టాలే. వాటిని భరించలేక రైతులు అప్పులు చేసి.. బోరుబావులు తవ్వించుకున్నారు. వాటి కింద ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. పంట చేతికొస్తే.. అప్పులు తీరుతాయని ఆశ పడుతున్నారు. మరిన్ని అప్పులు చేసి.. బొప్పాయి పెట్టారు. పంట కోత సమయం దగ్గరపడుతోంది. ఈ తరుణంలో తెగులు వారి ఆశలపై నీళ్లు చల్లాయి. నిండా ముంచేశాయి. ఎన్ని మందులు కొట్టినా.. అదుపులోకి రాలేదు. చేసేదిలేక, రైతులు తోటలను ధ్వంసం చేసుకుంటున్నారు. లక్షలు నష్టపోయి.. కన్నీళ్లు పెట్టుకుంటున్నారు..

ఆత్మకూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితుల కారణంగా బొప్పాయిని తెగులు చుట్టుముడుతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రావట్లేదు. పెట్టుబడులు పెరుగుతున్నాయే తప్ప.. ప్రయోజనం దక్కట్లేదు. దీంతో రైతులు పంటను వదిలేసుకుంటున్నారు. ఒక్క కోత కూడా వేయకుండానే రోటావేటర్‌తో ధ్వంసం చేస్తున్నారు. దీంతో లక్షల రూపాయలు నష్టపోతున్నారు. అప్పుల ఊబిలోకి (మిగతా 6లో...)


పంటను తొలగిస్తున్న దృశ్యం

జయహో భారత్..!




అభిమాన సునామీ..

పాక్‌పై టీమిండియా ఘన విజయంతో అనంతలో సంబరాలు

ఆసియా కప్ ఫైనల్లో పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం సాధించడంతో అనంత నగరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ గెలుపొందగానే.. వేల సంఖ్యలో అభిమానులు రోడ్లపైకి వచ్చారు. క్లాక్‌టవర్ వద్ద భారీగా గుమికూడారు. త్రివర్ణాన్ని చేత పట్టుకుని, జయహో నినాదాలతో హోరెత్తించారు. టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

-అనంతపురం (ఆంధ్రజ్యోతి)


త్రివర్ణ రెపరెపలు..


విన్యాసం చేస్తూ..


ఉప్పొంగిన దేశభక్తి


కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

(6లో..)

శ్రమతోనే గుండె భద్రం..!

మంచి ఆహారంతో ఆరోగ్యం
వ్యసనాలతో ముప్పు
నేడు ప్రపంచ హృదయ దినోత్సవం (6లో..)



3న కొత్త టీచర్లకు ప్లేస్‌మెంట్స్..?

- ఖాళీలు, కౌన్సెలింగ్‌పై విద్యాశాఖ కసరత్తు (6లో...)

జూనియర్ లైన్‌మన్‌కు ప్రమాదం

పరిస్థితి విషమం.. బళ్లారి విమ్స్‌లో చికిత్స

ఆపరేటర్ నిర్లక్ష్యమే కారణమంటున్న అధికారులు


గాయపడ్డ లైన్‌మన్

బొమ్మనహాళ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై పనులు చేస్తుండగా జూనియర్ లైన్‌మన్‌కు షాక్ తగిలి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బొమ్మనహాళ్ విద్యుత్ కార్యాలయంలో రామాంజనేయులు (38) విద్యుత్ గ్రేడ్-2 జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బొమ్మనహాళ్‌కు చెందిన వెంకటేశులు అనే రైతు పొలంలో విద్యుత్ మోటారుకు సరఫరా అయ్యే 11కేవీ విద్యుత్ హెడ్ ఫ్యూజ్ పోయిందని తెలిపాడు. దీంతో ఫ్యూజ్ వేసేందుకు వెళ్లాడు. కురువళ్లి, బొమ్మనహాళ్ ఫీడర్లు లైన్ విద్యుత్ సరఫరా కాకుండా స్థానిక సబ్‌స్టేషన్ నుంచి ఎల్సీ తీసుకున్నాడు. ఫ్యూజ్ వేస్తుండగా విద్యుత్ సరఫరా అయింది. దీంతో రామాంజనేయులు ఒక్కసారిగా కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బళ్లారి విమ్స్‌కు ప్రైవేట్ అంబులెన్స్‌లో తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న రాయదుర్గం ఏడీఈ శ్రీనివాస్‌నాయుడు, బొమ్మనహాళ్ ఏఈఈ లక్ష్మీరెడ్డి.. బాధితుడిని పరామర్శించారు. ప్రమాదంపై విచారిస్తున్నారు. ఆపరేటర్ తప్పిదమే కారణమన్న అనుమానాలు ఉన్నాయని, దీనిపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ నబీరసూల్‌ను అడగ్గా.. లైన్‌మన్ భార్య కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలుడి మృతి ఘటనలో స్టాఫ్‌నర్సు సస్పెన్షన్

ఉరవకొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్ల బాలుడు అహరూన్‌కుమార్ (5) మృతి చెందిన ఘటనలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సు ప్రియాంకను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈనెల 25న వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన రాజేష్, సరిత దంపతుల కుమారుడు అహరూన్ కుమార్ వైద్యం అందక మరణించాడని కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో డీసీహెచ్ఎస్ డేవిడ్ సెల్వరాజ్, వైద్యుడు, నర్సుతో వేర్వేరుగా విచారణ చేపట్టారు. వారితో రాతపూర్వకంగా వాంగ్మూలం తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్టాఫ్‌నర్సు ప్రియాంకను సస్పెండ్ చేశారు. డాక్టర్‌పై తదుపరి చర్యల కోసం వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు విచారణ నివేదికను పంపారు. బాలుడి మృతి ఘటనపై కలెక్టర్.. ముగ్గురు అధికారులతో ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు సమాచారం.

రాజస్థాన్ వాసి ఆత్మహత్య

రామగిరి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని ఓ వంకలో రోడ్డు పక్కనే చెట్టుకు ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన దేవరాం(30) రామగిరి సమీపంలో సోలార్ పనులు చేయడానికి వచ్చాడు. కొన్ని రోజులుగా ఇక్కడే పనులు చేసుకుంటూ ఉండేవాడు. శనివారం రాత్రి తోటి కూలీలతో ఉన్న దేవరాం రామగిరికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. షర్ట్‌తో చెట్టుకు ఉరివేసుకున్నాడు. తెల్లవారుజామున ఆ దారి వెంట వెళ్లే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దేవరాం అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడని, దీంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

- అనాథలైన ఇద్దరు పిల్లలు


సరస్వతి (ఫైల్)

ధర్మవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌లో ఆదివారం విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. టూటౌన్ సీఐ రెడ్డప్ప, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శాంతినగర్‌కు చెందిన దేరంగుల సరస్వతి (35) కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకునేది. ఆదివారం ఉదయం ఇంటిని శుభ్రం చేస్తుండగా విద్యుత్ మోటారును పక్కకు జరిపే సమయంలో విద్యుత్ షాక్ తగిలి, అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. సరస్వతి భర్త రాజశేఖర్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. మృతురాలికి ఇద్దరు పిల్లలు జ్యోతిఈశ్వర్, నిఖిల్ ఉన్నారు. వారు 8, 6 తరగతులు చదువుతున్నారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లలు అనాథలయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే పిల్లలను ఆదుకుని చదివించాలని స్థానికులు కోరుతున్నారు.

కారు ఢీకొని 13 గొర్రెల మృతి


గొర్రెల కళేబరాలు

బత్తలపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంటాపురం సమీపాన బైపాస్ రోడ్డులో ఆదివారం గొర్రెల మందను కారు ఢీకొన్న ప్రమాదంలో 13 గొర్రెలు మృతి చెందినట్లు ఏఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. గంటాపురం గ్రామానికి చెందిన భూమే అప్పస్వామి కుటుంబ పోషణ కోసం కొద్ది రోజుల క్రితం 50 గొర్రెలను తెచ్చుకొని మేపుతున్నాడు. ఆదివారం గొర్రెలను మేతకు తోలుకెళుతుండగా.. అనంతపురం నుంచి కదిరి వెళుతున్న కారు గంటాపురం సమీపంలోకి రాగానే రోడ్డు దాటుతున్న గొర్రెలను ఢీకొంది. ప్రమాదంలో 13 గొర్రెలు మృతి చెందడంతో కాపరి బోరున విలపించాడు. లక్షా యాభై వేల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయాడు.

టమోటా కిలో రూ.20

అనంతపురంరూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లి టమోటా మార్కెట్లో ఆదివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్ కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.10వేలు, సరాసరి ధర రూ.15తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,250 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

3న కొత్త టీచర్లకు ప్లేస్‌మెంట్స్..?

ఖాళీలు, కౌన్సెలింగ్‌పై విద్యాశాఖ కసరత్తు


ఖాళీలపై సమాచారం సేకరిస్తున్న విద్యాశాఖ ఐటీ సెల్ సిబ్బంది

అనంతపురం విద్య, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాలలో పోస్టులకు అర్హత సాధించిన కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయించడానికి అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే 755 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వారికి ఈనెల 25న అమరావతిలో సభ ఏర్పాటు చేసి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. దీంతో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ ప్లేస్‌మెంట్స్ కేటాయించాల్సి ఉంది. కొత్త టీచర్లకు అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణకు ఏర్పాట్లు చేసుకోవాలని ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ షెడ్యూల్ ఇచ్చింది. షెడ్యూల్ ప్రకటించడంతో శిక్షణ తర్వాత కౌన్సిలింగ్ నిర్వహిస్తారనే ప్రచారం సాగింది. సర్వీస్ పరిగణనలోకి రావాలంటే తప్పనిసరిగా ప్లేస్‌మెంట్స్ కేటాయించాలి. అపుడే జీతాలు ఇవ్వడానికి సమస్య ఉండదని ఆ శాఖ అధికారులు అంటున్నారు. ఆ మేరకే అక్టోబరు 3న కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలో ప్లేస్‌మెంట్లు కేటాయించడానికి రాష్ట్ర అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కమిషనర్ విజయరామరాజు కూడా 3న కౌన్సిలింగ్ ఉంటుందని, ఖాళీల వివరాలు పంపాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో జిల్లాలో ఖాళీల వివరాలపై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఆదివారం సెలవు రోజు కూడా ఐటీ సెల్ సిబ్బంది అన్ని మండలాల ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు ఫోన్‌లు చేస్తూ.. ఖాళీల సమాచారాన్ని సేకరించారు. ముందు పూర్తి టీచర్లు లేని స్కూళ్లకు, సబ్జెక్టు కొరత ఉన్న హైస్కూళ్లకు, గత బదిలీలలో బదిలీ అయ్యి రిలీవర్ లేకపోవడంతో అక్కడే పనిచేస్తున్న టీచర్ల స్థానాలకు కొత్తవారిని కేటాయించనున్నారు. ఉమ్మడి జిల్లాలో దూర మండలాలలోనే అత్యధిక పాఠశాలలో ఖాళీలు ఉన్నాయి. కౌన్సిలింగ్ 3న జరిగితే.. 4నుంచి 13వ తేదీ వరకు శిక్షణ జరిగే అవకాశం ఉందని ఆ శాఖ ద్వారా తెలుస్తోంది.

బొప్పాయి రైతు కన్నీళ్లు..!

(5వ పేజీ తరువాయి)

కూరుకుపోతున్నారు. ఆత్మకూరు మండలంలోనే దాదాపు 1200 ఎకరాల్లో పంటను తొలగించుకునే పరిస్థితి దాపురించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.


తెగుళ్లు సోకిన బొప్పాయి తోట

2 వేల ఎకరాల్లో సాగు

మండలంలో 2వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో బొప్పాయి పంట పెట్టారు. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. కోత కోయాల్సిన సమయం వచ్చింది. ఈ నేపథ్యంలో ఇటీవలిగా కురుస్తున్న వరుస వర్షాలు, ఆకాశం మేఘావృతమై ఉండడం అన్నదాత ఆశలపై నీళ్లు చల్లుతోంది. పంటను మజ్జిగ తదితర తెగులు చుట్టుముట్టాయి. రైతులు వేల రూపాయలు ఖర్చు చేసి, వాటికి మందులు పిచికారీ చేస్తున్నారు. పలు రకాల మందులు కొడుతున్నా.. అదుపులోకి రావట్లేదు. ఇక ఏమందు కొట్టాలో అర్థం కావట్లేదు, చెప్పే అధికారి కూడా లేడు. ఖర్చులు పెరుగుతున్నాయే తప్ప.. తెగులు అదుపులోకి రావట్లేదు. ఇక చేసేదిలేక రైతులు ఆశలు వదులుకుంటున్నారు. కొందరు రైతులు ఒక కోత కోశారు. మిగతావారు ఒక్క కోత కూడా వేయలేదు. పంటను తొలగించుకుంటున్నారు. దీంతో లక్షల రూపాయల పెట్టుబడులు మట్టిలో పోస్తున్నారు. మండలంలో 1200 ఎకరాల్లో పంటను కోత కోయకుండానే తొలగించుకుంటున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రూ.3 లక్షలు పెట్టుబడి.. రూ.15వేలు రాబడి



మూడెకరాల్లో బొప్పాయి సాగు చేశా. రూ.3 లక్షల వరకు పెట్టుబడులు పెట్టా. పంటకు మజ్జిగ తెగులు విపరీతంగా సోకింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాలేదు. ఒకే ఒక కోత కోశా. 2.5 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది. పంటను విక్రయించగా.. రూ.15 వేలు మాత్రమే వచ్చింది. కాయలను మార్కెట్‌కు తరలించే ఖర్చులు కూడా దక్కలేదు. మొత్తం నష్టపోయా.

-రైతు మహేష్‌రెడ్డి, ఆత్మకూరు

మొజాయిక్ తెగులు సోకింది

బొప్పాయికి రింగ్స్‌తోపాటు మొజాయిక్ తెగులు అధికంగా సోకుతోంది. తెల్లదోమ కారణంగా ఇవి వ్యాపిస్తున్నాయి. తెగుళ్ల నివారణకు వేప నూనెగానీ, కానుగ నూనెగానీ పంటలకు పిచికారీ చేసుకోవాలి. తద్వారా ఆకులపై పలుచటి పొర ఏర్పడుతుంది. ఆకులోని రసాన్ని పీల్చే అవకాశం లేక తెగులు తగ్గిపోతుంది.

-దివ్య, ఉద్యాన శాఖాధికారి

మానవతావాది.. గుర్రం జాషువా

మంత్రి సత్యకుమార్ యాదవ్


పల్లకిలో గుర్రం జాషువా చిత్రపటాన్ని మోసుకెళ్తున్న మంత్రి సత్యకుమార్, నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): తెలుగునేలకన్న ముద్దుబిడ్డ గుర్రం జాషువా గొప్ప జాతీయ మానవతావాది అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమలానగర్‌లో బీజేపీ జెండా ఎగురవేశారు. అనంతరం జడ్పీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం, సప్తగిరి సర్కిల్ మీదుగా అలెగ్జాండర్ హోటల్ వరకు గుర్రం జాషువా చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. స్వయంగా పల్లకి మోసిన మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో మాట్లాడారు. కలాన్నే ఆయుధంగా మలుచుకున్న గుర్రం జాషువా.. సమాజంలోని రుగ్మతలు, అసమానతలు, కుల గోడలను కూలదోసేందుకు కృషిచేసిన ఆధునిక వైతాళికుడు అని కొనియాడారు. గొప్ప పనులు చేసి, ప్రజలను చైతన్యం చేసిన మహానుభావుల విగ్రహాలను పెట్టాల్సిన చోట రాజకీయ నాయకుల విగ్రహాలు పెట్టడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. జిన్నా విగ్రహాన్ని గుంటూరులో ఏర్పాటు చేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన మంత్రి... ఆ స్థానంలో గుంటూరు జిల్లా వాసి జాషువా విగ్రహం ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేపడుతూ స్త్రీశక్తి ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కిందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో తెలుగు భాషను నిర్వీర్యం చేసిందని తెలిపారు. కుల, మత, ప్రాంతాలకతీతంగా బీజేపీ పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, నాయకులు రత్నమయ్య, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌ప్రసాద్, మారుతిగోవింద ప్రసాద్, నాగరాజు, మల్లిక, చైతన్య, కవితాశర్మ, అయ్యన్న, భీమశేఖర్, లక్ష్మిదేవి, ఆవుల చక్రధర్ యాదవ్, ఇలియాజ్, దేవరాజు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు


ప్రసంగిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వీడకుంటే ఉధృత పోరాటాలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. అనంతపురంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా 11వ మహాసభలు ఆదివారం ముగిశాయి. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన నిర్వహించిన సభకు నర్సింగరావుతోపాటు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ హాజరయ్యారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి హాజరై మహాసభలకు సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలు, హక్కులు, వేధింపులు, తొలగింపులు, ప్రభుత్వ విధానాలపై 15 తీర్మానాలను సభ ఆమోదించింది. 8 గంటల పనివిధానాన్ని రద్దు చేస్తూ 10 గంటల పనివిధానానికి అసెంబ్లీలో తీర్మానించడం, మహిళలు రాత్రిపూట విధులు చేయాలనడాన్ని వ్యతిరేకించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇస్తూ రెగ్యులర్ చేయాలనే డిమాండ్లను తీర్మానించారు. అనంతపురం జిల్లాకు కల్పవృక్షంగా ఉన్న ఆర్డీటి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేసి కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం 59 మందితో సీఐటీయూ జిల్లా నూతన కమిటీని, వారిలో 19 మందిని ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ ఆర్‌వీ నాయుడు, గోపాల్, వెంకటనారాయణ, రామాంజనేయులు, ముర్తుజా, శ్రీనివాసులు, రమాదేవి, శకుంతల, శివప్రసాద్, నాగభూషణం, సాకే నాగరాజు, నాగార్జునరెడ్డి, ఏటీఎం నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలు ఉపసంహరించుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ప్రైవేటీకరణ సంస్కరణలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. అనంతపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటీకరణ వల్ల ఇటు ప్రజలు, కార్మికులకు, ప్రభుత్వానికీ నష్టం జరుగుతోందని, యాజమాన్యాలు మాత్రమే లాభపడుతున్నాయని తెలిపారు. విద్యుత్ రంగంలో అతి ప్రమాదకరమైన పనులు చేస్తూ కార్మికులు మృతి చెందుతున్నారని, వారి కుటుంబాలకు ఎలాంటి భద్రత, ఆదరణ లేకుండా పోతోందన్నారు. సిమెంట్ పరిశ్రమల్లో కార్మికులంతా కాంట్రాక్టు కార్మికులుగా అతితక్కువ వేతనాలతో పనిచేయడం అన్యాయమని పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధమవుతున్నామని అన్నారు. డిసెంబరు 31, జనవరి 1, 2, 3, 4వ తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సీఐటీయూ అఖిల భారత మహాసభల్లో భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... పేదరికాన్ని నిర్మూలించేందుకు పీ4 విధానం అమలు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి చెబుతుండడం నమ్మశక్యంగా లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

శ్రమతోనే గుండె భద్రం..!

మంచి ఆహారంతో ఆరోగ్యం

వ్యసనాలతో ముప్పు

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



అనంతపురం వైద్యం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుండె లబ్‌డబ్ శబ్దాలు నిరంతరాయంగా సాగాలంటే శారీరక శ్రమ ఉండాల్సిందే. వ్యాయామం, పొలం పనులు ఏరూపంలోనైనా దేహానికి పనికల్పించాలి. తక్కువ కొవ్వు పదార్థాలు ఉన్న నాణ్యమైన ఆహారం భుజించాలి. అప్పుడే మీ హార్ట్ బీట్ మిస్ కాకుండా ఉంటుంది. మీతో పాటు మీ కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా జీవించాలంటే గుండెను భద్రంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రతి సంవత్సరం సెప్టెంబరు 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 'డోంట్ మిస్ ఏ బీట్' అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నారు.

వంశపారంపర్యంగా..

గుండె జబ్బులు వంశ పారంపర్యంగా వచ్చే అవకాశాలున్నాయని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ధూమ, మద్యపానం సేవించడం, సమతుల్యతలేని అహారాన్ని తీసుకోవడం, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు గుండెకు ప్రమాదకరంగా పొంచి ఉండే అంశాలు. అధిక ఒత్తిడి, మానసికంగా కుదుటలేకపోవడం, ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపకపోవడం, నిద్రలేమి తదితర కారణాలు గుండె జబ్బులకు మూలమని చెబుతున్నారు.

40 దాటితే పరీక్షించుకోవాల్సిందే..

ఆరోగ్యంగా ఉన్నాం మాకేంటని నిర్లక్ష్యం చేయకుండా 40 సంవత్సరాలు పైబడి వారంతా గుండె పరీక్షలు చేయించుకోవాల్సిందేనని డాక్టర్లు సూచిస్తున్నారు. కళ్ల ముందే తిరుగుతున్న వ్యక్తి ఉన్నఫలంగా కిందపడిపోవడం చూస్తుంటాం. ఏ అర్ధరాత్రో, అపరాత్రో నిద్రలోనే మరణిస్తుంటారు. శరీరంలో అప్పటికే అనారోగ్య సమస్యలు ఉన్నా బయటకు కనిపించకపోవడంతో ఇలాంటి విపత్కర పరిస్థితులు దాపురిస్తుంటాయని పేర్కొంటున్నారు. ఆరోగ్య పరీక్షలతోపాటు కూరగాయలు, పండ్లు, వ్యాయామం నిత్యజీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని సూచిస్తున్నారు. మీ గుండె భద్రంగా ఉండాలంటే మీ అలవాట్లు మంచిగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రాథమికంగానే వైద్యులను సంప్రదించాలి



అకస్మాత్తుగా ఛాతీలో బరువు, మంటగా ఉండటం, చేయి, దవడకు నొప్పి పాకడం వంటి గుండెపోటు లక్షణాలు ప్రాథమికంగా కనిపిస్తాయి. అలాంటి సమయంలో తక్షణమే డాక్టర్‌ను సంప్రదించాలి. పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించడం ద్వారా ప్రమాదం నుంచి తప్పించవచ్చు. ఆసుపత్రికి సకాలంలో చేరుకోవాల్సి ఉంటుంది. మంచి ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామం వంటి శారీరక శ్రమను చేయడం ద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

-డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, కార్డియాలజీ విభాగం, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

పీఎండీడీకేవై కింద 'అనంత' ఎంపిక

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ధన్-ధాన్య కృషి యోజన(పీఎండీడీకేవై) కింద అనంతపురం జిల్లా ఎంపికైందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 100 జిల్లాలు ఎంపికైతే... అందులో అనంతపురానికి కూడా చోటు దక్కిందన్నారు. పీఎండీడీకేవై కింద జిల్లా ఎంపిక కావడం వల్ల జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి విశేషంగా తోడ్పాటు అందుతుందన్నారు. ముఖ్యంగా రైతుల పంట ఉత్పాదకతను పెంచుతుందని, పంటల వైవిధ్యాన్ని, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తుందని వివరించారు. పంట సాగు, ఉత్పత్తుల తర్వాత నిల్వ, విలువ జోడింపు, మౌలిక వసతులను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. 2025-2026 నుంచి ఆరేళ్లపాటు ఈ పథకం అమలవుతుందని, జిల్లా రైతాంగ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. జిల్లా ఎంపిక కావడంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేశారని పేర్కొన్నారు.

రేబీస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్


కుక్కకు రేబీస్ టీకా వేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జంతువుల నుంచి రేబీస్ వ్యాధిసోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ సూచించారు. ప్రపంచ రేబీస్ వ్యతిరేక దినం సందర్భంగా ఆదివారం స్థానిక సాయినగర్‌లోని వెటర్నరీ ఆసుపత్రిలో కుక్కలకు రేబీస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ ఆసుపత్రి ఏడీ సురేష్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల కార్యక్రమాలు భేష్

● ఎమ్మెల్యే పరిటాల సునీత


బ్రహ్మకుమారీలతో పరిటాల సునీత

రామగిరి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సన్మార్గంలో నడిపించడంలో కీలకపాత్ర పోషిస్తున్న బ్రహ్మకుమారీల కార్యక్రమాలు అన్నిప్రాంతాల్లో ఉండాలని ఎమ్మెల్యే పరిటాలసునీత ఆకాంక్షించారు. మండల కేంద్రంలో బ్రహ్మకుమారీల ఈశ్వరీయ విద్యాకేంద్రంలో అష్టశక్తి నూతన భవన ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ఇందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆ భవనాన్ని పరిశీలించి అక్కడ నిర్వహించే కార్యక్రమాల గురించి బ్రహ్మకుమారీలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన దుర్గమ్మ, శివలింగానికి పూజలు చేయించారు. అనంతరం మాట్లాడుతూ బ్రహ్మకుమారీల కార్యక్రమాలు ఎంతోమందిని సన్మార్గంలో నడిపించడానికి దోహదపడతాయన్నారు. రాజయోగ ధ్యానం ద్వారా వ్యక్తిత్వ వికాసం, సామాజిక శ్రేయస్సు, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు అన్ని ప్రాంతాలలో ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేవెంట స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ప్రారంభం

నార్పల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆదివారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో వెలుగు మహిళా మార్ట్‌ను డీపీఎం గంగాధర్, ఏపీఎం తిప్పక్క ప్రారంభించారు. అందులో గోధుమ పిండి, కంది బేడలు, శెనగ బేడలు, బెల్లం, మైదాపిండి, మంచినూనె కలిపి కిట్‌ను రూ. 500లకు విక్రయిస్తున్నట్లు డీపీఎం తెలిపారు. అన్ని గ్రామ సంఘాలకు కిట్లు పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వెలుగు, మహిళా మార్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని స్పీకర్‌కు వినతి


స్పీకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడిని కోరారు. విజయవాడలో ఆదివారం ఆమె స్పీకర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎమ్మెల్యే పల్లె సింధూరకు సత్కారం


సింధూరారెడ్డి, రఘునాథ రెడ్డిని సత్కరిస్తున్న గ్రంథాలయ ఉద్యోగులు

అనంతపురంవిద్య, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లెసింధూర రెడ్డి శాసనసభలో ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లడంతో గ్రంథాలయశాఖ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే సింధూరరెడ్డిని, మాజీమంత్రి పల్లెరఘునాథరెడ్డిని నగరంలోని నివాసంలో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ద్యోగ సంఘాల నాయకులు కమ్మన్న, జయరామ్, ప్రతాప్‌రెడ్డి, రవికుమార్‌నాయుడు, రామాంజనేయులు, గోవింద్ పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ కోర్సుల నిర్వహణ తనిఖీ

అనంతపురంవిద్య, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో చేపడుతున్న ఇంటర్న్‌షిప్ కోర్సుల నిర్వహణను ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ శ్రీధర్ ఆదివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అక్కడ ఏఏకోర్సులు నిర్వహిస్తున్నారు. ఏఏకోర్సుల్లో ఎంతమంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు అనేదానిపై ఆరాతీశారు. తర్వాత నగరంలోని ఐటీఐకాలేజీలో హార్డువేర్ విద్యార్థులు చేస్తున్న ప్రాక్టికల్స్‌ను పరిశీలన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వృత్తివిద్యాకోర్సులతో మంచిభవిష్యత్తుఉంటుందని, చిత్తశుద్ధితో నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ట్రైనర్స్ మహేష్‌బాబు, కదిరిన్ పాల్గొన్నారు.

ఆదాయం రూ.3.62 లక్షలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశులసంతతో రూ.3,62,850 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి రాఘవేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,22,250లు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంత ద్వారా రూ.1,40,600 ఆదాయం మార్కెట్‌కు వచ్చిందని చెప్పారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకులు స్వామి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రాముస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ ప్రతి భారతీయుడికి ప్రేరణ

● రెండేళ్లలో అన్ని మెడికల్ కాలేజీలు పూర్తి చేస్తాం ● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్


మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న మంత్రి సత్యకుమార్, బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీబాత్ ప్రతి భారతీయుడికి ప్రేరణ కలిగిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. స్థానిక అలెగ్జాండర్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం ప్రధానమంత్రి 126వ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా మంత్రితో పాటు బీజేపీ నాయకులు వీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మన్‌కీబాత్‌లో షహీద్ భగత్‌సింగ్ త్యాగస్ఫూర్తి, లతామంగేశ్వర్ గానమాధుర్యం, గాంధీజయంతి సందర్భంలో ఖాదీ ప్రోత్సాహం, మహిళా సాధికారిత విజయాలు, సముద్రయానంలో యువ మహిళల సాహసాలు, స్వచ్ఛభారత్ ఉద్యమం, ఆర్ఎస్ఎస్ సేవా భావం వంటి ఎన్నో అంశాలను ప్రధాని ప్రస్తావించారన్నారు. మన్‌కీబాత్ ప్రతి భారతీయుడికి ప్రేరణ కలిగిస్తోందన్నారు. వైసీపీ నేతలు మెడికల్ కాలేజీలపై చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం లేదని, పబ్లిక్-ప్రైవేటు-పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో కొనసాగుతాయని తెలిపారు. పీపీపీ విధానంలో ప్రభుత్వమే యజమాన్యమని, పేదలకు ఉచిత నాణ్యమైన వైద్యసేవలు అందిస్తామని అన్నారు. పేద విద్యార్థులకు వైద్యవిద్యను సులభతరం చేసే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో సెల్ఫ్ ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ కోటా, ఎన్నారై కోటా విధానాలు తెచ్చిన జగన్‌మోహన్ రెడ్డి మెడికల్ కాలేజీలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. పీపీపీ విధానంపై అసెంబ్లీలో బహిరంగ చర్చకు రావాలని జగన్‌ను ఆహ్వానించామని, రాకుండా తప్పించుకున్నారని, శాసనమండలిలో చర్చ పెట్టిన సమయంలోనూ వైసీపీ సభ్యులు గైర్హాజరయ్యారని తెలిపారు. వైసీపీ నాయకులు ప్రజల మధ్య అపోహలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలందించేలా రూ.25లక్షల వరకు ఉచిత వైద్యసహాయం అందిస్తామన్నారు. వైద్యవృత్తి, వైద్యవిద్య అనే ఈ క్లిష్ట పరిస్థితుల్లో నాణ్యత కాపాడే దిశగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. సంరక్షించాలి

అనంతపురంరూరల్/క్లాక్‌టవర్: మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా సమాజానికి మేలు చేయవచ్చునని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని చిరంజీవి రెడ్డి కళాశాలలో ప్రధాన నరేంద్రమోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న నమో వనం-ఏక్ పెడ్ మాకే నామ్(అమ్మపేరుతో ఒక మొక్క) ఉద్యమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రతిఒక్కరూ తమ తల్లి పేరుతో మొక్కను నాటి సంరక్షించాలన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు భవిష్యత్తు తరాలకు హరిత వాతావరణాన్ని అందించడమే కాకుండా తల్లి స్మరణను సజీవంగా నిలుపుతాయన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు రాజేష్, సీఆర్ఐటీ విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి, అజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయాన్ని పునర్నిర్మిస్తాం

● ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఎమ్మెల్యే దగ్గుపాటి


ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మకర్తల మండలి కార్యవర్గం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మొదటిరోడ్డులో వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయాన్ని రూ.4.50కోట్ల వ్యయంతో పునర్నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. ఆలయానికి సంబంధించి నూతనంగా ఏర్పాటైన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవ సభను ఆదివారం ఆలయంలోనే అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై తొలుత సతీసమేతంగా కాశీవిశ్వేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేయించారు. అనంతరం ఆలయ ఆవరణలోని కల్యాణమండపంలో ఎమ్మెల్యే సమక్షంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నరేంద్రచౌదరితోపాటు సభ్యులు దొండ్లగు రాజు, బోయ వెంకటరమణమ్మ, దేవరకొండ రత్నమ్మ, వనితాబాయి, సోంపల్లి చరణ్‌తేజ్, ఆదిశేషయ్య, రాధా, అనంతకుమారి, ఎక్స్ అఫీషియో సభ్యుడు కిశోర్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబుతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్, బీజేపీ సహకారంతో ఈ ధర్మకర్తల మండల కమిటీని ఎంపిక చేసినట్లు తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకుంటోందని, కాబట్టి పునర్నిర్మాణానికి సీఎంను నిధులు కోరామని తెలిపారు. అడిగిన వెంటనే రూ.4.50 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ఇంకా ఇందులో 20 శాతం దాతల సహకారం అవసరముంటుందని అన్నారు. మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చంద్రదండు ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ... ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు అందించే మొత్తాన్ని కూటమి ప్రభుత్వం పెంచుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్రుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు జేఎల్ మురళీధర్, రాయల్ మురళి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, కార్యదర్శి వాసాపురం బాబు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, డైరెక్టర్లు చల్లా లక్ష్మీప్రసాద్, పీఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, బొమ్మినేని శివ, బీజేపీ రాష్ట్ర నాయకుడు లలిత్‌కుమార్, జనసేన నాయకుడు జయరాంరెడ్డి, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, టీఎన్‌టీయూసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన్‌కుమార్, కార్పొరేటర్ జనబలం బాబా, మాజీ కార్పొరేటర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సోలార్ వెలుగులు..

అనంతపురం క్రైం: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ప్రతి ఇంటా సోలార్ వెలుగులు రావాలని, పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వ ప్రసాద్ సూచించారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మహిళా సంఘాల ఆర్పీలకు పీఎం సూర్యఘర్ యోజన కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఇంటా సోలార్ పవర్ ఉండాలన్నదే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఈ పథకానికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు. వీటిని ఏర్పాటు చేసుకుంటే...15 ఏళ్ల వరకూ ఉచితంగా విద్యుత్ పొందవచ్చునని తెలిపారు. దీనిపై ఆర్పీలు మహిళా సంఘాల ద్వారా విస్తతంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. తర్వాత ఆయన సతీమణి శ్రీలక్ష్మితో కలిసి దసరా కానుకగా ఆర్పీలకు పసుపు, కుంకుమ, చీరలు పంపిణీ చేశారు.

ఘనంగా భగత్‌సింగ్, గుర్రం జాషువా జయంతి


భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు


గుర్రం జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఈఎఫ్ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలర్పించిన విప్లవకారుడు భగత్‌సింగ్, సంఘసంస్కర్త, ఆధునిక కవి గుర్రం జాషువా జయంతి వేడుకలను రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఆర్ఈఎఫ్) నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి సేవల్ని కొనియాడారు. ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణనాయక్, ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రంగస్వామి ఆర్ఈఎఫ్ విశ్వవిద్యాలయాల రాష్ట్ర కన్వీనర్ చింతన, కో-కన్వీనర్లు, రాయలసీమ కో-కన్వీనర్లు నాయకులు పాల్గొన్నారు.

●అనంతపురంవిద్య: ప్రభుత్వడిగ్రీఆర్ట్స్ కాలేజ్ వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి ఏఐవైఎఫ్,ఏఐఎస్ఎఫ్‌నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాయకులుసంతోష్‌కుమార్, దేవేంద్ర, చందు, శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కుళ్లాయిస్వామి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం క్లాక్‌టవర్: ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న జాషువా విగ్రహానికి నగర మేయర్ మహ్మద్ వసీం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

●నార్పల: మండలకేంద్రంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ కార్యదర్శి నవీన్, మండల కార్యదర్శి జయనరసింహ, నాయకులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీనివాసుడు


గరుడవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజున ఆదివారం శ్రీనివాసుడు గరుడవాహనంపై ఆశీనుడై దర్శనమిచ్చాడు. తొలుత ఆలయంలో అర్చకులు శ్రీదేవి,భూదేవి సమేత స్వామి వారి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, అలంకరణలు చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం వివిధరకాల పుష్పాలతో అలంకరించిన గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి ఊరేగింపు చేశారు.

చిన్మద సేవా ట్రస్ట్ సభ్యుల సమావేశం

గార్లదిన్నె, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరులో గల వైఎల్ఆర్ ఫంక్షన్ హాల్లో ఆదివారం అఖిల భారత అయ్యప్ప చిన్మద సేవాట్రస్ట్ తొలి జాతీయ కార్యవర్గం సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ట్రస్ట్ జాతీయ కార్యవర్గ సభ్యుడు బ్యాళ్ల ఈశ్వరయ్య, సభ్యులు గురుస్వామి, రుద్ర కోటేశ్వరరావు, ఆదిమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మండలం ఎన్‌హెచ్ 44 నుంచి పాలబావి వరకు చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని క్వాలిటీ కంట్రోల్ ఈఈ మల్లికార్జున మూర్తి ఆదివారం పరిశీలించారు. రూ.496.75 లక్షల అంచనాతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. దీంతో క్యూసీ డీఈ లోకన్న, పీఐయూ డీఈ నారాయణస్వామితో కలిసి రోడ్డు పనుల్లో నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. ఎక్కడా కూడా నాణ్యతాలోపాలకు తావులేకుండా చూడాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

తల్లీపిల్లలు క్షేమంగా ఇంటికి..!

● కేసును ఛేదించిన నాలుగో పట్టణ పోలీసులు

ఆంధ్రజ్యోతి స్పందన

అనంతపురం క్రైం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన తల్లి, ముగ్గురు పిల్లలు ఎట్టకేలకు క్షేమంగా ఇంటికి చేరారు. నాలుగో పట్టణ పోలీసులు గాలించి పట్టుకుని ఇంటికి చేర్చారు. నగరంలోని మారుతీ నగర్‌కు చెందిన నాగలక్ష్మి(29) అనే మహిళ తన ముగ్గురు పిల్లలు ఆశిష్(6) అనన్య(9), మహిధర్(12)ను వెంటబెట్టుకుని ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్తతో వాగ్వాదం జరగడంతో మనస్థాపం చెందిన ఆమె పిల్లలను వెంటబెట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో నగరంలోని మిస్సింగ్ కేసులపై ఈ నెల 15వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'అదృశ్యంపై అలసత్వం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన నాలుగో పట్టణ పోలీసులు కేసును సీరియస్‌గా తీసుకున్నారు. పలు ప్రాంతాల్లో ముమ్మరంగా గాలించారు.. ఎట్టకేలకు ఆ మహిళ, ముగ్గురు పిల్లలు కడప జిల్లా సింహాద్రిపురం మండలం లావనూరులోని ఓ తోటలో ఉన్నట్లు గుర్తించారు. నాలుగో పట్టణ పోలీసుల బృందం అక్కడికి వెళ్లి.. వారిని సురక్షితంగా అనంతపురం తీసుకొచ్చారు. తర్వాత నలుగురినీ క్షేమంగా ఇంటికి చేర్చినట్టు నాలుగో పట్టణ సీఐ జగదీష్ ఆదివారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

త్రిలోక్షకు కాంస్యపతకం


త్రిలోక్ష శాన్వితో కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి టీటీ పోటీల్లో త్రిలోక్ష శాన్వికు కాంస్యపతకం దక్కింది. విజయవాడలోఆదివారం రాష్ట్ర స్థాయి టేబుల్‌టెన్నిస్-2025 టోర్నమెంట్‌ను నిర్వహించారు. జిల్లానుంచి ప్రాతినిధ్యం వహించిన త్రిలోక్ష శాన్వి అండర్-11 బాలికల కేటగిరిలో అత్యంత ప్రతిభ కనబరిచి కాంస్యపతకం సాధించింది. కోచ్‌లు రవీంద్రనాథ్, వంశీకృష్ణతో పాటు జిల్లా టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు త్రిలోక్షశాన్విని అభినందించారు.

5 నుంచి జేశాప్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ స్టేడియంలో జేశాప్ ఆధ్వర్యంలో అక్టోబరు 5 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్లను ఆదివారం వారు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చేత వేర్వేరుగా ఆవిష్కరింపజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 16జట్లు టోర్నీలో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేశాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, జిల్లా గౌరవాధ్యక్షుడు రేపటి రామాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి జగదీష్, జిల్లా అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

మదర్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డు పత్రం అందజేత


విజయసాయికుమార్‌కు రికార్డు పత్రాన్ని అందిస్తున్న మంత్రి సత్యకుమార్

అనంతపురంటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్‌కు మదర్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డు దక్కింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సాయి ట్రస్టు వరుసగా 21 సంవత్సరాలపాటు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేపట్టింది. ఇందుకు గాను మదర్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో ఆ ట్రస్టు అధ్యక్షుడికి చోటు దక్కింది. ఈ నేపథ్యంలో సదరు రికార్డ్స సంస్థవారు మదర్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డు నమోదు పత్రాన్ని పంపగా.. ఆదివారం జిల్లా కేంద్రంలోని అలెగ్జాండర్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ విజయసాయికుమార్‌కు అందజేసి సత్కరించారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

శింగనమల,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 1993-1994 వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించారు.

మహమ్మద్ ప్రవక్త జీవితం.. ఆదర్శప్రాయం


సమావేశంలో మాట్లాడుతున్న మౌలానా ఇబ్రహీం ఖలీల్ సాబ్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ముస్లింల ఆరాధ్యదైవమైన హజరత్ మహమ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శప్రాయమని కేరళకు చెందిన మదీన్ అకాడమీ ఫౌండర్, చైర్మన్ మౌలానా ఇబ్రహీం ఖలీల్ సాబ్ పేర్కొన్నారు. నగరంలోని రహమత్‌నగర్‌లో గల గౌసియా మసీదులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవిత్ర ఖురాన్ పఠనం, నమాజు, ప్రత్యేక దువా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... ముస్లింలు ప్రతిఒక్కరూ ప్రవక్త బోధనలు, ఖురాన్ సందేశాలను ఆచరించాలన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ శాంతి, సామరస్యాలతో మెలగాలని సూచించారు. గౌసియా మసీదు ముతవల్లి ఎంఎం బాషా, కార్యదర్శి హోండా జిలాన్ ముస్లింమతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'దళిత అధికారులను వేధిస్తే ఊరుకోం'

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దళిత సామాజిక వర్గానికి చెందిన అధికారులను వేధిస్తే ఊరుకోమని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అవుకు ఈశ్వరయ్య హెచ్చరించారు. నగరంలోని ఆసంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. దళితులపై కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారులు విచక్షణారహితంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఎంఈఓ-2 డాక్టర్ రామచంద్రను సమగ్రశిక్ష ఏపీసీ శైలజ చేస్తున్న బ్లాక్‌మెయిల్ ఇందుకు నిదర్శమన్నారు. ఇలాంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాలమహానాడు జిల్లా కమిటీ ఏర్పాటు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ మాల మహానాడు జిల్లా నూతన కమిటీని కలెక్టరేట్‌వద్దనున్న పోలీస్ చెన్నప్ప ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా నుగుమంచి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా రాము, ఉపాధ్యక్షులుగా సురేష్‌బాబు, కోశాధికారిగా సోమశేఖర్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా మహిళా అధ్యక్షురాలిగా శ్రీదేవి, ఉపాధ్యక్షులుగా అనిత, ప్రధాన కార్యదర్శిగా సుమలత, కోశాధికారిగా జ్యోతి, కార్యదర్శిగా రామక్షిని ఎన్నుకున్నారు. నగర, నియోజకవర్గాల కమిటీలనూ ఏర్పాటు చేశారు.

పంచాయతీ కార్మికులకు దసరా కానుకల పంపిణీ

అనంతపురం రూరల్ సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేట పంచాయతీ కార్మికులకు ఎంఎస్ఎస్ సేవా సంస్థ వారు దసరా కానుకలను ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక ఎంపీటీసీ మెంబర్ మహబూబ్‌బీ రూ.50వేల చెక్కులను పారిశుధ్య కార్మికులకు అందించారు. సేవా సంస్థ అధ్యక్షులు సాదిక్ వలి, సభ్యులు పాల్గొన్నారు.


పాతూరు అమ్మవారి శాలలో శ్రీఫలాలతో వాసవీమాతకు అలంకరణ


కొత్తూరు అమ్మవారి శాలలో యాంకెట్ డైమండ్ల అలంకరణలో వాసవీమాత

పాహిమాం.. పరమేశ్వరీ..

● శరన్నవరాత్రుల్లో భాగంగా ఏడోరోజున వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. జిల్లాకేంద్రంలోని వివిధ ఆలయాల్లో అర్చకులు వేకువజామునే అమ్మవార్ల మూలవిరాట్టులను, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ఆలయాల వద్ద కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలుతో అలరించారు.


పాతూరు ఆలయ ఆవరణలో సాంస్కృతిక ప్రదర్శనలు


తపోవనం వేదగాయత్రి ఆలయంలో ఓంసంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

క్రైం న్యూస్..

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సానిక తిలక్‌నగర్‌లో నివాసముంటున్న విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి అరికెరి శ్రీనాథ్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. శ్రీనాథ్ కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి వారం క్రితం కాశీకి వెళ్లారు. శనివారం రాత్రి దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న ఎనిమిదిన్నర తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. ఆదివారం స్థానికులు గమనించి ఈ విషయాన్ని టూటౌన్ పోలీసులకు అందించారు. టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అరికెరి శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● కసాపురం రోడ్డులోని బెస్తకాలనీలో నివాసముంటున్న వంట మనిషి రూప్‌సాగర్ ఇంట్లో చోరీ జరిగింది. వారం క్రితం కుటుంబ సభ్యులతో వంట పనిచేయడానికి వెళ్లాడు. ఆదివారం ఇంటితాళాలు పగలగొట్టి ఉండటాన్ని స్థానికులు గుర్తించి రూప్‌సాగర్‌కు చోరీ విషయాన్ని చెప్పారు. అతను గుంతకల్లుకు చేరుకుని బీరువాలో ఉంచిన నాలుగు తులాల బంగారు నగలు, రూ. 2లక్షలు నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి.. కసాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు దర్యాప్తులో ఉంది.

జూదరుల అరెస్ట్

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో కొండలో పేకాట ఆడుతున్న 14 మందిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. వారి నుంచి రూ. 87,150 నగదు, ఐదు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కోర్టులు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని వట్లకుంట సమీపంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ. నాలుగు వేలు స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

● తాడిపత్రి : మండలంలోని చుక్కలూరు సమీపంలోని గ్రానెట్ ఫ్యాక్టరీల్లో కొత్త వంతెన వద్ద కంపచెట్లల్లో పేకాట ఆడుతున్న 15 మందిని ఆదివారం అరెస్ట్‌చేశామని, వారి వద్ద ఉన్న రూ.41,930 నగదు స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

● అలాగే తాడిపత్రి పట్టణంలోని సీపీఐ కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి.. వారివద్ద నుంచి రూ.37,370 స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ తెలిపారు.

● గుత్తి రూరల్ : గుత్తి మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులోని ఓ తోటలో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ రామారావు తెలిపారు. వారి నుంచి రూ.39,330 నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

విద్యుత్ స్టార్టర్ చోరీ

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కణేకల్లు క్రాస్‌లో నివాసముంటున్న జయరాములుకు రాయదుర్గం మండలం గ్రామ పంచాయతీ పరిధి టీ వీరాపురం గ్రామ సమీపంలోని పొలంలో బోరుబావి ఉంది. శనివారం అర్ధరాత్రి దుండగులు ఆ బోరుబావికి అమర్చిన రూ. ఎనిమిది వేలు విలువైన స్టార్టర్‌ను అపహరించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు జయరాములు తెలిపారు. నాలుగు నెలల క్రితం కూడా తన పొలంలో నిలువ ఉంచిన దాదాపు రూ. 15 వేల విలువైన డ్రిప్‌వైర్లు చోరీకి గురైట్లు వాపోయాడు. పోలీసులు ఈ దుండగులపై నిఘా వేసి.. దొంగతనాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

కత్తితో దాడి

తాడిపత్రి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక టైలర్స్‌కాలనీలో నివాసముంటున్న రఫీ, సన్నీ స్నేహితులు. ఆదివారం వీరు మద్యం సేవించారు. తనకు సరిపోని వ్యక్తులతో నువ్వు మాట్లాడుతావా అంటూ రఫీపై సన్నీ, మరికొంతమంది కత్తితో దాడిచేసి గాయపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

భూవివాదంలో ఘర్షణ


కుందుర్పి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబుగుంపల పంచాయతీ కొలిమిపాలెం గ్రామానికి చెందిన గోవిందు తన పొలంలో టమెటా సాగు చేశాడు. పక్క పొలం యజమాని నరసింహ ఆ పొలం తనకు వస్తుందని పలుమార్లు ఘర్షణకు దిగాడు. ప్రస్తుతం గోవిందు సాగు చేసిన టమోటా పంటను, బోరుబావి పైపులను ఆదివారం ధ్వంసం చేశాడు. ఆ రైతులు ఘర్షణ పడ్డారు. గోవింద్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.



కళ్యాణదుర్గం: కాత్యాయనీదేవిగా వాసవీమాత



తాడిపత్రి: అష్టలక్ష్మిగా వాసవీమాత



పామిడి: వాసవీ మాతకు గరుడసేవ



గుత్తిరూరల్ : సేవాఘడ్‌లో మహాచండీదేవిగా మాతాజగదాంబ



రాయదుర్గం: చండీ గాజులమ్మగా చౌడేశ్వరీదేవి



ఉరవకొండ: పెన్నహోబిలంలో మహాలక్ష్మీదేవిగా ఉద్భవదేవి

పాహిమాం.. పరమేశ్వరీ

న్యూస్ నెట్‌వర్క్-ఆంధ్రజ్యోతి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైనా ఆదివారం అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని.. పూజలు చేయించారు.



కూడేరులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమావేశం

కూడేరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కూడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదువుకున్న విద్యారులు.. అదే పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. నాటి గురువులను సన్మానించారు. వీరితోపాటు చదువుకున్న అరవకూరు గ్రామానికి చెందిన శివరాజ్ రోడ్డు ప్రమాదంలో, కమ్మూరు గ్రామానికి చెందిన అనిత భర్త అనారోగ్యంతో మరణించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ. 20 వేలచొప్పున ఆర్థికసాయం చేశారు.

● కుందుర్పి: బెస్తరపల్లి ఉన్నత పాఠశాలలో 2005లో టెన్త్ చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. నాటి గురువులను సన్మానించారు.



కుందుర్పి: బెస్తరపల్లిలో సమావేశమైన అలనాటి విద్యార్థులు

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



రూ.50 వేలు ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక గరీబ్ కాలనీకి చెందిన విద్యార్థిని అనుజ్ఞ క్యాన్సర్ బారిన పడి.. బెంగళూరు కిద్వాయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆ విద్యార్థిని కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ రూ.50 వేలు ఆర్థిక సాయం చేసింది. ఆ డబ్బును బాధిత కుటుంబ సభ్యులకు ఆ ట్రస్ట్ చైర్మన్, మాస్టారు బద్దేనాయక్, కోశాధికారి అబ్దుల్ వాహబ్, సభ్యులు సాయినాథ్, ఉపాధ్యాయులు లక్ష్మన్న, రామాంజినేయులు, వెంకటేశ్, మహేశ్ ఆదివారం అందజేశారు.

వర్షం కోసం పూజలు

పెద్దపప్పూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరదయ్యపల్లి గ్రామంలో వర్షాల కోసం గ్రామస్థులు కాటమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక బోనాలు సమర్పించారు. గడచిన కాలంలో వర్షాలు పడకపోవడంతో పొలాలు బీడుగా మారాయని, ఈ సారైనా వర్షాలు బాగా రావాలని ఈ పూజలు చేస్తున్నామని రైతులు తెలిపారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో ఏఐఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఆదివారం పలువురు నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డీ జగదీష్ మాట్లాడుతూ.. దేశం కోసం చిన్న వయస్సులోనే ప్రాణాలను సైతం త్యాగం చేసిన భగత్‌సింగ్ ఆదర్శప్రాయుడన్నారు. అలాగే డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● రాయదుర్గంరూరల్: స్థానిక ఏపీఎన్‌జీఓ భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఇందులో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కోశాధికారి నాగయ్య నాయకులు శంకర్, గంగాధర్, సురేష్, మారేష్, నాగరాజు, హనుమంతు, శ్రీధర్, విజయ్ పాల్గొన్నారు.

సైకిల్ నుంచి పడి బాలుడి మృతి



మదన్ సాయి (ఫైల్)

యాడికి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానికంగా నివాసముంటున్న అశోక్, ప్రియల కుమారుడు మదన్ సాయి (15) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన మదన్ కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి సైకిల్‌పై వెళ్తూ.. స్పీడ్ బ్రేకర్ దాటుతూ అదుపుతప్పి.. కిందపడ్డాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మరణించాడు.

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయి పోటీల్లో వర్షిత ప్రతిభ



వర్షిత

గుంతకల్లు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన అండర్ 16 విభాగం 600 మీటర్ల పరుగు పోటీల్లో మండలంలోని నక్కనదొడ్డి గ్రామానికి చెందిన వర్షిత మూడో స్థానంలో నిలిచి పతకాన్ని సాధించింది. వర్షితను కోచ్ సంజీవ్ అభినందించారు.

వైసీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్‌ను మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్ భవాని, వైస్‌చైర్‌పర్సన్ వై నైరుతిరెడ్డి, నాయకులు లింగన్న, చాంద్‌బాషా, ఖలీల్, అబ్దుల్‌బాసిద్, మల్లికార్జునశాస్త్రి, రాము, తిక్కస్వామి పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,440 క్యూసెక్కులు

బెళుగుప్ప, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,440 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,400 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.708 టీఎంసీల నీటి నిల్వ ఉందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,904 క్యూసెక్కులు వెళ్తోందని అధికారులు వెల్లడించారు.

విద్యార్థులకు శిక్షణ

యల్లనూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాపారరంగంలో మెలకువలపై విద్యార్థులకు ఆదివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వృత్తివిద్య కోర్సుల విద్యార్థులకు రిటైల్ రంగంలో తీసుకోవాల్సిన మెలకువలపై వృత్తివిద్య కోర్సు ట్రైనర్ వెంకటేష్ వివరించారు. విద్యార్థుల భవిష్యతుకు భరోసా ఇవ్వడానికి ఇలాంటి శిక్షణ తరగతులు ఏర్పాటుచేసినట్లు ప్రధానోపాధ్యాయుడు గోపాల్ తెలిపారు.

వైసీపీ అక్రమాలపై విచారణ చేయించాలి

బొమ్మనహాళ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని రాయదుర్గం అసెంబ్లీ కన్వీనర్ హీరోజిరావు ఆదివారం కోరారు. ఓబుళాపురంలో సీజ్ చేసిన మైనింగ్‌ను వైసీపీ ప్రభుత్వంలో దొంగలించారని, దాని సీబీఐతో విచారణ చేయాలని విప్ కాలవ శ్రీనివాసులు అసెంబ్లీలో డిమాండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం దీంతో పాటు ఇసుక మాఫియా, మట్కా, పేకాట నిర్వహణ తదితర వాటిపై కూడా విచారణ చేయించాలని కోరారు.

సొంత డబ్బులతో వీధిదీపాల ఏర్పాటు

కణేకల్లు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆనంద్ రెడ్డి రూ. 12 వేలు విలువైన వీధిదీపాలను ఎస్సీ, బీసీ, ఓసీ కాలనీల్లో ఆదివారం ఏర్పాటు చేశాడు. ఎవరూ పట్టించుకోకపోవడంతో తానే వీధిదీపాలను వేయించినట్లు తెలిపారు.



వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తున్న టీడీపీ నాయకుడు

మండలాల్లో ఇన్‌చార్జిల పాలన

- కుంటుపడిన అభివృద్ధి
- తిష్టవేసిన సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పుట్లూరు తహసీల్దార్ కార్యాలయం

పుట్లూరు/విడపనకల్లు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పుట్లూరు, విడపనకల్లు మండలాల్లో ముఖ్యమైన అధికారులు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇన్‌చార్జీల పాలనతో ఈ మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరగలేక ప్రజలు విసుగెత్తిపోయారు. జిల్లా అధికారులు స్పందించి.. రెగ్యులర్ అధికారులను నియమించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

● పుట్లూరు మండలంలో తహసీల్దార్, ఎస్ఐ, పశువైద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

తహసీల్దార్ కార్యాలయంలో...: తహసీల్దార్ శేషారెడ్డిని శింగనమల మండలానికి మూడు నెలలక్రితం బదిలీచేశారు. పుట్లూరుకు శేషారెడ్డినే ఇన్‌చార్జిగా నియమించారు. కార్యాలయంలో ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ వివిధ కారణాలతో సెలవులో ఉన్నారు. దీంతో వన్‌బీ, అడంగల్ కావాలన్నా.. భూముల ఆన్‌లైన్ సమస్య ఉన్న శింగనమల మండలానికి వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడి రైతులు ప్రజలు వ్యయప్రయాసాలకు ఓర్చి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో... ఎస్ఐ వెంకటనరసింహను చిత్తూరు జిల్లా చంద్రగిరికి మూడు నెలలక్రితం బదిలీచేశారు. మండలంలో కొన్ని సమస్యాత్మక కారణాలు ఉండడంతో ఇక్కడికి వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

పశువైద్యశాలలో.. మండల పశువైద్యురాలు సువర్ణ నెల క్రితం పెద్దపప్పూరు మండలానికి బదిలీ అయ్యారు. ఇక్కడ తాడిపత్రి మండలం వెంకటాంపల్లి వైద్యశాల నుంచి సుబ్బారెడ్డి అనే వైద్యున్ని నియమించినా.. ఆయన కొన్ని కారణాల వల్ల ఇక్కడకు రాలేదు. దీంతో సువర్ణనే ఇన్‌చార్జ్‌గా నియమించారు.

● విడపనకల్లు మండలంలో తహసీల్దారు, ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

తహసీల్దారు కార్యాలయంలో.. ఇక్కడి తహసీల్దార్ జనవరిలో బదిలీ అయ్యారు. ఆ స్థానంలో రెగ్యులర్ అధికారిని ఇంతవరకూ నియమించలేదు. అంతేకాకుండా ఈ తొమ్మిది నెలల్లో తొమ్మిది మంది ఇన్‌చార్జి తహసీల్దార్లను మారారు. వారు ఎప్పుడూ అందుబాటులో ఉండకపోవడంతో ఆదాయ, కులధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం విద్యార్థులు, వన్‌బీ, అడంగల్, భూముల ఆన్‌లైన్ సమస్యలపై రైతులు నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు.

ఎంపీడీఓ కార్యాలయంలో... ఇక్కడి ఎంపీడీఓ మూడు వారాల క్రితం బదిలీపై కర్నూలుకు వెళ్లారు అప్పటి నుంచి ఇక్కడ పర్మినెంట్ ఎంపీడీఓ లేరు. అభివృద్ధి పనులపై సమావేశాలు జరగడం లేదు. మండలంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. పర్యవేక్షించే అధికారులు లేక పాలన మొత్తం కుంటుపడింది.





విడపనకల్లు : ఖాళీగా ఉన్న తహసీల్దారు, ఎంపీడీఓ కుర్చీలు

ఆర్టీసీ ఆదాయానికి గండి

- అనుమతులు లేకుండా ప్రైవేట్ వాహనాల సంచారం
- పట్టించుకోని ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులు

ఉరవకొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నుంచి అనంతపురానికి అనుమతులులేని ప్రైవేట్ వాహనాలను ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. స్థానిక డిపో ఎదుటే వాహనాలు ఆపి .. ఆర్టీసీ ప్రయాణికులను వారివారి వాహనాల్లో ఎక్కించుకుని వెళ్తున్నా .. ఆర్టీసీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆర్టీసీకి నెలకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. ఇటీవల ప్రైవేట్ ఆపరేటర్లు 25 దాకా వాహనాలను కొనుగోలు చేసి, వాటిని ఉరవకొం డ, అనంతపురానికి తిప్పుతున్నారు. అనంతపురానికి ఆర్టీసీ బస్సులో టిక్కెట్లు ధర రూ.85 ఉంటే, వైట్ బోర్డు కలిగిన కార్లల్లో ఒక్కొక్కరికి చిన్న, పెద్ద అనే తేడాలేకుండా రూ.100 వసూలు చేస్తున్నారు. పెట్రోల్ వాహనాలను ఆపరేటర్లు ఆదాయం కోసం గ్యాస్, సిలిండర్ అమర్చుకుని తిప్పుతున్నా రు. నాన్‌స్టాప్ కావడంతో ధర ఎక్కువైనా ప్రయాణికులు వీటినే ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి వాహనాలను షిర్డీ సాయి ఫోర్ వీల్ మోటార్ వెహికల్ అసోసియేషన్ నాయకులు నాలుగు నెలల క్రితం అడ్డుకున్నారు. కొన్ని రోజులు కట్టడి చేసిన ఆర్టీసీ అధికారులు.. మళ్లీ ఆ ప్రైవేట్ వాహనాలు యదేచ్ఛగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ అధికారులతో ఆ వాహనయ జమానులతో కుమ్మక్కు అయ్యారనే విమర్శలు ఆరోపణలూ ఉన్నాయి. ఈ నేపథ్యం లో ఉరవకొండ ఆర్టీసీ డిపో తనిఖీకి వచ్చిన ఆర్టీసీ ఎండీకి ద్వారకా తిరుమల రావుకు ఆర్టీసీకి కలుగుతున్న నష్టంపై షిర్డీ సాయి ఫోర్ వీల్ మోటార్ వెహికల్ అసోసియేషన్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆర్ఎం, డీఎం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేద ని తెలిపారు. డీఎం హంపన్నను వివరణ కోరగా.. విషయాన్ని ఆర్టీఓ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కట్టడిచేస్తామన్నారు.



బస్టాండ్ వద్ద ఉన్న ప్రైవేట్ వాహనాలు